సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025



సేన.. జగడాలేనా

జనసేనలో జగడాలు కనిపిస్తున్నాయి. అగ్రనేతలు వచ్చిన ప్రతిసారీ ఇవి పెరుగుతున్నాయి. - IIలో



వైద్య విద్యార్థులతో చికిత్సలా?

పీహెచ్‌సీలకు వైద్య విద్యార్థులను పంపడంపై విస్మయం వ్యక్తమవుతోంది. విద్యార్థులూ ఆందోళన చెందుతున్నారు. - IIలో

వర్సిటీలో క్రీడాకారుల ఎంపిక నేడు

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తరఫున అంతర్ వర్సిటీ మహిళా కబడ్డీ పోటీల్లో పాల్గొనే జట్టును శుక్రవారం వర్సిటీలో ఎంపిక చేస్తామని వర్సిటీ స్పోర్ట్స్ డీన్ డాక్టర్ రవికుమార్ గురువారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. అనుబంధ డిగ్రీ కాలేజీల్లో ఆసక్తి ఉన్న విద్యార్థినులు ఉదయం 10.30కు వర్సిటీ మైదానానికి హాజరు కావాలని సూచించారు. జూలై-2000 తర్వాత జన్మించిన వారు సంబంధిత కళాశాల ప్రధానాచార్యుల ధ్రువీకరణ పత్రంతో రావాలన్నారు.

న్యూస్‌రీల్

దివ్యాంగుల ఫిర్యాదుల పరిష్కారానికి 'స్వాభిమాన్' నేడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: దివ్యాంగుల ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రతి నెల మూడో శుక్రవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నారు. ఈ నెల ప్రత్యేక కార్యక్రమం 'స్వాభిమాన్' శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరగనుంది.

డైస్ సెంటర్ ఆకస్మిక తనిఖీ



డైస్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని మెంటల్ హెల్త్ ఎస్టాబ్లిష్‌మెంట్ సెంటర్ (డైస్)ను గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదరి కె.హరిబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. 0–6 ఏళ్లలోపు అంగవైకల్య ప్రమాదం ఉన్న పిల్లలకు సమగ్రమైన సమగ్ర సేవలను అందించాలని సూచనలు ఇచ్చారు. వైకల్యాన్ని ముందుగానే గుర్తిస్తే వ్యాధి నయం చేసే వీలుంటుందని పేర్కొన్నారు. తలసేమియా వంటి వ్యాధులను ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారికి మెరుగైన సేవలు అందించాలని సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ఎస్ చైతన్య, మేనేజర్ అప్పలనాయుడు, ఇతర వైద్య నిపుణులు ఉన్నారు.

'మహిళా హోంగార్డుపై అనుచితంగా ప్రవర్తించినందుకే'

శ్రీకాకుళం క్రైమ్ : కాశీబుగ్గ కేంద్రంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు కల్తీ మద్యంపై ఇటీవల జరిపిన నిరసన ఘటనకు సంబంధించి ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి గురువారం విలేకరులతో మాట్లాడారు. అనుమతి లేని ర్యాలీలు, ధర్నాలకు గుంపులుగా రావడమే కాక విధుల్లో ఉన్న ఓ మహిళా హోంగార్డుపై అనుచిత ప్రవర్తనకు వేణు గోపాలరెడ్డిపై వివిధ సెక్షన్ల కింద కేసు పెట్టినట్లు తెలిపారు. ప్రోత్సహించిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుపై కూడా కేసులు పెట్టామన్నారు. ఇటీవల జిల్లాకేంద్రంలో జరిగిన నకిలీ స్టాంపుల వ్యవహారంపై విలేకరులు ఎస్పీ వద్ద ప్రస్తావించగా.. కేసుకు సంబంధించి ఫేక్ రబ్బరు స్టాంపుల తయారీదారులిద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించా మని, పక్కా ఎవిడెన్సులతో కొన్ని నకిలీ డాక్యుమెంట్లను గుర్తించామన్నారు. ఇంకా విచారణ పూర్తి కాలేదని, ఎవరున్నా వదిలి పెట్టేది లేదని స్పష్టం చేశారు.

నవంబర్ 3 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమ్మె



మున్సిపల్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మిక సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ నవంబర్ 3 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె చేయనున్నట్లు ఏఐటీయూసీ కౌన్సిల్ సభ్యులు టి.తిరుపతిరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కళ్యాణి.అప్పలరాజు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, మున్సిపల్ కార్మికులకు ఇల్లు, స్థలాలు కేటాయించి మున్సిపల్ కాలనీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు జె.గురుమూర్తి, ఎన్. పార్థసారథి, ఆర్. గణేష్, పి.సురేష్, రామచంద్ర, రసూల్, తంగి.నారాయణ రావు, పుష్ప ,సీతయ్య, ప్రతినిధి అరుగుల రమణ తదితరులు పాల్గొన్నారు.

దళిత చట్టాలపై అవగాహన

శ్రీకాకుళం పాతబస్టాండ్: దళితులు సమాజంలో గౌరవం పొందేందుకు, వారు ఆత్మాభిమానంతో మెలిగేందుకు ప్రభుత్వం, చట్టాలు రక్షణగా ఉంటాయని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ సమావేశ మందిరంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్సీ సంక్షేమ పథకాలపై గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. లీడ్ జిల్లా మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ లలిత కుమారిలు మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో ఎస్సీలకు ప్రత్యేక రుణాలు, రాయితీలు ఉన్నాయని, వీటిని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పొందవచ్చని తెలిపారు.

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లా?

సాక్షిపై సర్కారు దాడి

ముక్త కంఠంతో ఖండించిన ప్రజాస్వామ్యవాదులు

అక్షరంపై కక్ష కడుతున్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తి ప్రమాదంలో పడేలా పాలకులు వ్యవహరిస్తున్నారు. అధికారం చేతిలో ఉందని 'సాక్షి'పై అక్కసు చూపిస్తున్నారు. వార్తలకు భయపడి పత్రిక గొంతు నొక్కాలని శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. అధికార పక్ష అక్రమాలపై పత్రికా లోకమే కాదు, రాజకీయ వర్గం కూడా దుమ్మెత్తి పోస్తోంది. ఖాకీలతో సర్కారు చేయిస్తున్న దమన కాండపై మండిపడుతోంది. -సాక్షి నెట్‌వర్క్



అక్కసుతోనే సాక్షిపై కేసులు

కూటమి ప్రభుత్వం వచ్చాక పత్రికా స్వేచ్ఛను భంగం కలిగించే విధంగా కేసులు నమోదు చేస్తుంది. 'సాక్షి' ఎడిటర్, నెల్లూరు బ్యూరో ఇన్‌చార్జిలతో పాటు పలువురు సాక్షి విలేకరులపై కేసులు పెట్టడం శోచనీయం. కేవలం 'సాక్షి'పై అక్కసుతోనే ఈ విధంగా కేసులు పెడుతున్నారు.
– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు



జర్నలిస్టులపై కేసులు బనాయించడం సరికాదు

లిక్కర్ స్కామ్‌పై వార్తలు రాస్తే కేసులు బనాయించడం సరికాదు. ప్రజా ప్రయోజనాల కోసం ప్రశ్నించే సాక్షి పత్రిక గొంతు నొక్కేయాలనుకోవడం అప్రజాస్వామికం. – కె.వి.జి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



పత్రికల గొంతు నొక్కుతారా

అక్రమ కేసులు పెట్టి పత్రికల గొంతు నొక్కేయాలనుకోవడం సరికాదు. ఇలాంటి చర్యలకు పాల్పడటం అంటే సంపాదక స్వేచ్ఛను హరించడమే.
– దుంపల లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ కాళింగ కుల బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు



కక్ష సాధించడం తగదు

ప్రజలకు వాస్తవాల్ని తెలిపే జర్నలిస్టులపై కక్ష సాధించడం తగదు. 'సాక్షి' కార్యాలయం, 'సాక్షి' పత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డిపై పోలీసు శాఖ వ్యవహరిస్తున్న తీరు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా సాగుతోంది. ఖండన తెలపడం, న్యాయస్థానాన్ని ఆశ్రయించడం వంటి అవకాశాలు ఉన్నా ఇలా కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు.
- పిరియా విజయ, జెడ్పీ ఛైర్‌పర్సన్, పిరియా సాయిరాజ్, మాజీ ఎమ్మెల్యే



పక్షపాత వైఖరి సరికాదు

కల్తీ మద్యంపై కథనాలు రాస్తున్న సాక్షి పత్రిక జర్నలిస్టులతో పాటు ఎడిటర్‌ను అక్రమంగా విచారణ పేరుతో వేధించడం సరికాదు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన పోలీసులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ నేతల కుట్రల్లో భాగస్వాములవుతున్నారు. – పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, టెక్కలి



సాక్షి మీడియాపై దాడి.. ప్రజాస్వామ్యానికి హాని

ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంలా గుర్తింపు పొందిన మీడియా వ్యవస్థపై పోలీసు దాడులు సిగ్గుచేటు. ఈ విధానం పౌర సమాజానికి హాని కలిగించే విధంగా ఉంది. నకిలీ మద్యం కుంభకోణంపై వార్తలు రాస్తున్న 'సాక్షి' కార్యాలయంపై పోలీసులు దాడి చేయడం అభ్యంతరకరం.
– నర్తు రామారావు, ఎమ్మెల్సీ



జర్నలిస్టులపై బెదిరింపు ధోరణి సరికాదు

ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను ప్రజలకు వివరించే క్రమంలో జర్నలిస్టులు, పత్రికా ఎడిటర్లపై బెదిరింపు ధోరణి మంచి పద్ధతి కాదు. పత్రికల్లో వస్తున్న కథనాలపై స్పందించాలి తప్ప బెదిరించడం, అక్రమ కేసులు నమోదు చేయడం అప్రజాస్వామికం. హైదరాబాద్‌లో 'సాక్షి' కార్యాలయం వద్ద ఎడిటర్‌కు నోటీసుల పేరుతో నెల్లూరు పోలీసులు ఇబ్బందికరమైన చర్యలు చేపట్టడం సరైన పద్ధతి కాదు.
– బెండి నరసింగరావు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు.



ఎన్నాళ్లీ అరాచకాలు

పత్రికల్లో వ్యతిరేక వార్తలు వస్తే సద్విమర్శలుగా స్వీకరించాలి. పచ్చ కళ్లతో చూస్తున్న పోలీసులకు ప్రతీదీ తప్పుగానే కనిపిస్తుంది. కల్తీ మద్యంపై కథనాలు రాసిన సాక్షి పత్రిక జర్నలిస్టులు, ఎడిటర్‌పై అక్రమ విచారణ సరికాదు. వీలైతే కల్తీ మద్యాన్ని అరికట్టాలి. పలాసలో వైఎస్సార్‌సీపీ నాయకులపై పోలీసులు కుట్ర పూరితంగా వ్యవహరించారు.
– సింగుపురం మోహనరావు, న్యాయవాది, టెక్కలి



పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడమే కూటమి లక్ష్యం

రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడానికి 'సాక్షి' ఎడిటర్‌పై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోంది. ఇలా అక్రమ కేసులు పెట్టడం మంచి పద్ధతి కాదు. కల్తీ మద్యంపై 'సాక్షి' కథనాలు ప్రచురిస్తే వాటిని చూడలేక 'సాక్షి' కార్యాలయం, ఎడిటర్, సంబంధిత విలేకరులపై అక్రమ కేసులు పెట్టడం సబబు కాదు. హైదరాబాద్ 'సాక్షి' కార్యాలయం వద్ద నెల్లూరు పోలీసుల తీరు దారుణం.
– పేడాడ శ్రీరామమూర్తి, న్యాయవాది, దవళపేట

బాండ్ రాసి.. ముఖం చాటేసి..!

ప్రేమ పేరుతో వంచన

- యువతిని మోసగించిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్
- పెళ్లి చేసుకుంటానని రూ.100బాండ్‌పై రాసుకున్న అంగీకార పత్రం
- ముహూర్తం పెట్టి, పెళ్లి కార్డులు పంచి పెట్టాక ప్లేటు ఫిరాయించిన యువకుడు
- అడిగితే ఎమ్మెల్యే కూన రవి గ్యాంగ్ పేరుతో బెదిరిస్తున్న వైనం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఐదేళ్ల పాటు ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ముహూర్తం పెట్టి.. పెళ్లి కార్డులు పంచాక ప్లేటు ఫిరాయించాడు. ఇదేమని అడిగితే ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ గ్యాంగ్ పేరు చెప్పి బెదిరిస్తున్నాడు. ఈ గ్యాంగ్ పేరుతో ఇప్పటికే ఇసుక, ల్యాండ్ సెటిల్‌మెంట్లు జరుగుతున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. రూరల్ పోలీసు స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయడంతో అతడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేయక తప్పలేదు. వివరాల్లోకి వెళితే..

విశాఖ జిల్లా పరవాడ మండలానికి చెందిన యువతి శ్రీకాకుళం నగరంలోని విశాఖ ఏ కాలనీలో గల పెద్దమ్మ ఇంటిలో ఉంటుంది. రజక సామాజిక వర్గానికి చెందిన ఆమెకు ఆమదాలవలస మండలం గోపీనగర్‌కు చెందిన మెట్ట శరత్ చంద్రతో పరిచయం ఏర్పడింది. విశాఖలో ఇంటర్ చదువుతున్న సమయంలో పరిచయం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని చెప్పి శారీరకంగా దగ్గరయ్యాడు. ఆ సమయానికి ఆ అమ్మాయి మైనర్. వారి ప్రేమ ప్రయాణం కొనసాగుతున్న తరుణంలోనే శరత్ చంద్ర సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మారాడు. అతనికి ఇన్‌స్టాలో పెద్ద ఎత్తున ఫాలోవర్స్ కూడా ఉన్నారు. ప్రేమాయణం కొన్నాళ్లు నడిచాక పెళ్లి చేసుకోమని ఆ యువతి కోరింది. ఎప్పటికప్పుడు అతడు నమ్మిస్తూ వచ్చాడు. ఒక రోజు గట్టిగా నిలదీసేసరికి రజక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తివని, పెళ్లి చేసుకునేందుకు కుటుంబ సభ్యులు ఒప్పుకోవడం లేదని మాట మార్చాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆ యువతి తను నివాసం ఉంటున్న పెద్దమ్మ ఇంట్లో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది. కుటుంబ సభ్యులు గమనించి రిమ్స్‌కు సకాలంలో తీసుకెళ్లి చికిత్స చేయడంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. పోలీసుల వరకు వ్యవహారం వెళ్లింది.



పెళ్లి చేసుకోవాలంటూ శరత్‌చంద్ర టీషర్టు పట్టుకుని నిలదీస్తున్న యువతి

ఈ సమయంలో పెద్ద మనుషుల సమక్షంలో పెళ్లి చేసుకోవడానికి ఒప్పందం జరిగింది. 100 రూపాయల బాండ్ పేపర్‌లో ఒప్పందం చేసుకున్నట్టు లిఖిత పూర్వకంగా రాసుకున్నారు. పెద్ద మనుషులు కూడా సంతకాలు చేశారు. యువతి తల్లిదండ్రులు కట్న కానుకల కింద రూ. 3లక్షల నగదు, 4తులాల బంగారం, 20సెంట్లు భూమి ఇచ్చేందుకు కూడా అంగీకారపత్రం రాసుకున్నారు. ఈ మేరకు అక్టోబర్ 10న వివాహం ముహూర్తం పెట్టుకున్నారు. పెళ్లికార్డులు కూడా ముద్రించి బంధువులకు, స్నేహితులకు యువతి కుటుంబ సభ్యులు పంచారు. కట్నం డబ్బులు అడ్వాన్సుగా ఇచ్చేందుకు యువతి కుటుంబ సభ్యులు గోపీనగర్ గ్రామానికి వెళ్లగా శరత్ చంద్ర ఆయన కుటుంబంలోని వారు పెళ్లి చేసుకునేది లేదని తేల్చి చెప్పేశారు. కూన రవికుమార్ పేరు చెప్పి గ్యాంగ్‌గా చెలామణి అవుతున్న చైతన్య అనే యువకుడి ప్రోద్బలమే దీనికి కారణమని తెలిసింది. వాళ్లు ఏం చేయలేరని, మామయ్య వెనకున్నారని భరోసా ఇవ్వడంతోనే శరత్ చంద్ర కుటుంబం కఠిన నిర్ణయం తీసుకున్నట్టు గుర్తించారు. ఎంత నిలదీసినా అటువైపు నుంచి ఒకటే సమాధానం రావడంతో మోసపోయామని గ్రహించారు. దీంతో చేసేది లేక యువతి కుటుంబ సభ్యులు శరత్ చంద్ర ఇంటి వద్ద వద్ద ఆందోళనకు దిగారు. అయినప్పటికీ పెళ్లికి ససేమిరా అనడంతో శ్రీకాకుళం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను మైనర్‌గా ఉన్నప్పటి నుంచి ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన శరత్ చంద్రతో పాటు అతడి తల్లిదండ్రులు, అతడికి సహకరించిన స్నేహితులపైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం రూరల్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యే కూన రవి పేరు చెప్పి జడిపిస్తున్నారు..

ఎమ్మెల్యే కూన రవికుమార్ మేనల్లుడట. మెట్ట శ్రీను అట, చైతన్య అట, కిల్లి సాయి, చల్లా వాసు ఇంటికొచ్చి జడిపిస్తున్నారు. తేల్చుకుని రండని కూన రవికుమార్ పంపించారట. మమ్మల్ని భయపెడుతున్నారు. కూన రవి సర్. మేము పేదవాళ్లం. ఐదేళ్లుగా ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. మా పిల్లను ఇప్పుడు ఎవరు పెళ్లి చేసుకుంటారు. మాకు డబ్బు వద్దు, కేసులు వద్దు, న్యాయం కావాలి. ఆ అబ్బాయితో పెళ్లి చేయాలి.
– రమణమ్మ, యువతి పెద్దమ్మ

ఒడిశా 🡒 ఉత్తరప్రదేశ్

వయా శ్రీకాకుళం

- 208.7 కిలోల గంజాయితో పట్టుబడిన ఉత్తరప్రదేశ్ వాసులు
- రూట్ మార్చి తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- గంజాయి తరలిస్తున్న కారు అద్దాలపై ఢిల్లీ హైకోర్టు అడ్వకేట్ ట్యాగ్స్



నిందితులు, గంజాయిని చూపిస్తున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : ఉత్తరప్రదేశ్‌లో ఉన్న ఓనరు ఆదేశిస్తాడు.. వీరు పాటిస్తారు. ఎవరి దగ్గరకు వెళ్లాలి.. ఎక్కడ గంజాయి కొనాలి.. ఎలా తిరిగి రావాలి.. చెక్‌పోస్టులు ఉంటే ఎలా తప్పించుకోవాలి.. ఇలా అన్ని ప్లాన్లు ఓనరే వేస్తాడు. అతను చెప్పింది చెప్పినట్లు వీరు పాటిస్తారు. ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా వీరు ఖాకీల నుంచి తప్పించుకోలేకపోయారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్, మీరట్‌లకు చెందిన సునీల్ (38), విశాల్ (28)లు ఒడిశాలోని కొరాపుట్ నుంచి టొయోటో కారులో 208.7 కిలోల గంజాయిని చెక్‌పోస్టులు తప్పించి.. రూట్ మార్చి మళ్లించే యత్నంలో చిలకపాలెం వద్ద ఎచ్చెర్ల పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం విలేకరులకు వివరాలు వెల్లడించారు.

ఎప్పటి నుంచో..

మీరట్‌లోని డౌట్‌లో స్పై హోటల్ నడుపుతున్న గౌరవ్ వద్ద సునీల్, విశాల్‌లు కొంతకాలంగా పనిచేస్తున్నారు. ఎప్పటి నుంచో వీరు గంజాయి క్రయవిక్రయాల్లో సిద్ధహస్తులు. ఈ క్రమంలో ఒడిశాలోని కొరాపుట్ జిల్లా దంతపురి సమీప లంపటాపుట్ గ్రామానికి చెందిన సమర మాటం అలియాస్ డొంబురు వద్ద ఈనెల 14న 40 ప్యాకెట్లలో 208.7 కిలోల గంజాయిని తీసుకున్నారు. శ్రీకాకుళం చెక్‌పోస్టులను తప్పించి దారి మళ్లించి విశాఖ చేరేందుకు వీరు టొయాటో కారులో కొరాపుట్ నుంచి బయల్దేరారు.

రూట్ మార్చారిలా..

ఒడిశా కొరాపుట్ నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర బోర్డర్ ఆనుకొని ఉన్న సిమిలిగుండ మీదుగా పొత్తంగి వద్ద అడ్డుదోవ తీసుకుని సమీపంలోని ఒడిశా సుంకి చెక్‌పోస్టును తప్పించారు. అక్కడి నుంచి సాలూరు, రామభద్రాపురం, రాజాం, పొందూరులు దాటి చిలకపాలెం జంక్షన్ వద్దకు వచ్చి పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. అప్పటికే ఎచ్చెర్ల ఎస్‌ఐ కు ఈగల్‌టీమ్ సమాచారం ఉండటంతో కారును తనిఖీ చేశారు.

కారుపై ఢిల్లీ హైకోర్టు అడ్వకేట్ స్టిక్కర్లు

వీరు ప్రయాణిస్తున్న కారుపై ఢిల్లీ హైకోర్టు బార్ కౌన్సిల్, జాతీయ చిహ్నం గుర్తుతో అడ్వకేట్ 2019, అడ్వకేట్ 2021 స్టిక్కర్లు ఉండటంతో అనుమానం వచ్చి లోపల తనిఖీ చేయగా 40 ప్యాకెట్లలో గంజాయి పట్టుబడింది. వీరు చిలకపాలెం నుంచి విశాఖ చేరి అక్కడి నుంచి విజయవాడ, ఖమ్మం, వరంగల్ మీదుగా నాగపూర్ హైవేకు చేరి అక్కడి నుంచి మీరట్ వెళ్లి తమ ఓనరుకు అప్పగిస్తామని విచారణలో పేర్కొన్నారు.

వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వెల్లడించారు. ప్రస్తుతం గంజాయిని వీరికి అందించిన ఒడిశా సమరమాటం, అతనికి సహకరించిన మరో వ్యక్తి పరారీలో ఉన్నారని, మీరట్ ఓనర్ అయిన గౌరవ్ వద్దకు పోలీసులను పంపించామని, వీరేకాక మరో ముగ్గురిని నిందితులుగా గుర్తించామని ఎస్పీ పేర్కొన్నారు. చాకచక్యంగా కేసును ఛేదించిన పోలీసులను అభినందించారు.

ఎచ్చెర్ల ఎంపీపీపై పీడీ యాక్ట్

- విజయవాడలో ఎచ్చెర్ల ఎంపీపీ ఎం.చిరంజీవిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఖాకీల తీరును ఖండించిన ఎంపీపీ వర్గీయులు
- ఫరీద్‌పేటపై నిఘా పెట్టాం: ఎస్పీ మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం క్రైమ్, ఎచ్చెర్ల : ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవిని మంగళవారం రాత్రి జిల్లా పోలీసులు విజయవాడలో అదుపులోకి తీసుకున్నారు. పీడీ యాక్ట్ కింద అరెస్టు చేస్తున్నట్లు చెప్పి విశాఖ కారాగారానికి తరలించారు. దీంతో ఎంపీపీ వర్గీయులు, ఫరీద్‌పేట గ్రామస్తులు పోలీసుల తీరును తీవ్రంగా ఖండించారు. గ్రామంలో హత్యలు జరిగాయని, లెక్కకు మించి కేసుల్లో నిందితులుగా ఉన్న వారిని వదిలేసి ఒక్క ఎంపీపీ చిరంజీవి పైనే పీడీ యాక్టు పెట్టడం సరికాదని అన్నారు. అయితే శాంతిభద్రతలకు ఆటంకం కలిగించే వారు కావడం వల్లనే ఎంపీపీపై పీడీ యాక్టు నమోదు చేసినట్లు ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి చెబుతున్నారు.

అన్ని గ్రామాలపై దృష్టి పెట్టాం

ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవిపై 14 కేసులు ఉన్నాయి. ఫరీద్‌పేటలో గడిచిన రెండు హత్యాఘటనల నాటి నుంచి నిఘా పెట్టాం. 33 మందిని గుర్తించాం. ఒక్క ఫరీద్‌పేటలోనే కాదు జిల్లాలో ప్రతి చోటా శాంతి భద్రతలకు, ప్రజా శాంతికి భంగం కలిగించేలా వ్యవహరించేవారి లిస్టు మా వద్ద ఉంది. అలాంటి వారిపై ఒక్కొక్కరిగా రౌడీ షీట్లు, సస్పెక్టు షీట్లు, ఆపై పీడీయాక్టులు పెడుతున్నాం. నిఘాలో ఎంపీపీ శాంతిభద్రతలను విఘాతపరిచే వ్యక్తిగా నిర్ధారణ కావడంతో కలెక్టర్‌కు నివేదిక పంపి ఆయన ఉత్తర్వుల తోనే పీడీ యాక్టు పెట్టాం.– మహేశ్వర రెడ్డి, ఎస్పీ



ఇది అన్యాయం

ఎంపీపీ చిరంజీవిని పీడీ యాక్ట్‌పై పోలీసులు అరెస్టు చేయడం అన్యాయం. టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఫరీద్‌పేటలో ఇద్దరు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను చంపేశారు. మళ్లీ ఇప్పుడు అదే వర్గానికి చెందిన ఎంపీపీ చిరంజీవిని ఊరి నుంచి తరిమేందుకే చూస్తున్నారు. ఇది న్యాయమా..?
– మొదలవలస సతీష్, ఫరీద్‌పేట



చంపిన వారిని అరెస్టే చేయలేదు

వైఎస్సార్ సీపీకి చెందిన కూన ప్రసాద్‌ని గత ఏడాది చంపేశారు. అందులో ఇద్దరు ముద్దాయిలను ఇప్పటివరకు అరెస్టు చేయలేదు. నాలుగు నెలల కిందట మరో వైఎస్సార్ సీపీ కార్యకర్త గోపిని చంపేశారు. అదే కేసులో బెయిల్‌పై వచ్చిన ముద్దాయిలు రోజూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మా నాయకుడు చిరంజీవిని ఇలా ఇరికించడం అన్యాయం.
– మొదలవలస ఫాల్గుణ, ఫరీద్‌పేట



రాజకీయం చేస్తున్నారు..

వైఎస్సార్ సీపీ వాళ్లని చంపేసి.. తిరిగి అదే వర్గానికి చెందిన మా నాయకుడిని అన్యాయంగా పోలీసులు అరెస్టు చేశారు. చంపిన వారిని విడిచిపెట్టి ఎంపీపీని అక్రమ అరెస్టు చేశారు. ఒక వైపే ఇలా చేస్తూ రాజకీయం చేస్తున్నారు. న్యాయపరంగా ఎదుర్కొంటాం. – కూన కిరణ్, ఫరీద్‌పేట

ప్రమాద స్థలం పరిశీలన



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మణరావు

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలోని భవానీ పురంలో బుధవారం రాత్రి సంభవించిన ప్రమాదంపై టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు ఆరా తీశారు. ప్రమాద సంఘటన స్థలాన్ని గురువారం పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఈ ప్రమాదం దురదృష్టకరమని, ఇందులో ఏడుగురు గాయపడ్డారని తెలిపారు. ప్రమాదంలో గాయపడిన అగనంపూడి రాధ, ఆమె కుమార్తె సోనియాలు విశాఖలో చికిత్స పొందుతున్నారు. రాధ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు అంటున్నారు. అలాగే బండి బాలకృష్ణ, బండి పూర్ణ, పన్నీరు చిరంజీవిలు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో బండి సంతు, అమృతలు నరసన్నపేటలో చికిత్స పొందుతున్నారు. ఒకే కుటుంబంలో ఉన్న ముగ్గురు వ్యక్తులకు ఈ ప్రమాదంలో గాయాలు కావడంతో వారి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.

ఒకరికి ఒకరై..



అటూ ఇటూ వాహనాలు.. చెవుల నిండా రణగొణ శబ్దాలు.. బిజీబిజీగా కదులుతున్న మనుషులు.. ఆ హడావుడిలో కనిపించిన చిత్రమిది. తొంభై ఏళ్ల వృద్ధుడు తన భార్య చేతిని వదలకుండా జాగ్రత్తగా రోడ్డు దాటిస్తున్న చిత్రం చూపరులను ముచ్చటగొలిపింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

క్లుప్తంగా

గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సంస్కృతం సబ్జెక్టులో బోధనకు గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు తెలిపారు. సంస్కృతం సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌తోపాటు పీహెచ్‌డీ, నెట్/ఏపీ సెట్ అర్హతలు కలిగిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యతను ఇవ్వడం జరుగుతుందన్నారు. బోధన నైపుణ్యం, మౌఖిక పరీక్ష, ఉన్నత అర్హతల వెయిటేజీ ఆధారంగా తుది ఎంపిక జరుగుతుందన్నారు. బయోడేటా, విద్యార్హతలతో కూడిన దరఖాస్తులను నేడు (17న) సాయంత్రంలోగా కళాశాలలో సమర్పించాలని, ఇంటర్వ్యూ శనివారం ఉదయం 10 గంటలకు కళాశాలలో జరుగుతుందని, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ శ్రీరాములు కోరారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు బొడ్డపాడు విద్యార్థిని


ఝాన్సీ

పలాస: పలాస మండలం బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని రాపాక ఝాన్సీ రాష్ట్ర స్థాయి స్కూలు గేమ్స్ పోటీలకు 14 ఏళ్ల విభాగంలో ఎంపికైంది. అథ్లెటిక్స్‌లో లాంగ్‌జంప్, హైజంప్, 200 మీటర్ల పరుగుపందెంలో జిల్లా ఎంపికలో మొదటి స్థానంలో నిలిచింది. ఇప్పుడు ఆమె రాష్ట్ర స్థాయిలో శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నవంబరు 8, 9, 10 తేదీల్లో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఝాన్సీ పాల్గొనున్నారని బొడ్డపాడు హైస్కూలు పీడీ పద్మలోచన్ చెప్పారు. ఆమె రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంపై బొడ్డపాడు ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

ఎస్టీ కమిషన్‌కు విన్నపంపై అధికారుల పరిశీలన


కొండ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం కోసం పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

సారవకోట: మండలంలోని మహాశింగి పంచాయతీ కన్నయ్యగూడ గ్రామానికి రోడ్డు నిర్మించాలని ఆ గ్రామస్తులు ఎస్టీ కమిషన్‌కు కొన్ని రోజుల కిందట విన్నవించారు. ఎస్టీ కమిషన్ సూచనల మేరకు సర్వే విభాగం ఏడీ వెంకటరావు, డీఐఓ జనార్దనావులతో స్థానిక తహసీల్దార్ విజయలక్ష్మి మహాశింగి నుంచి కన్నయ్యగూడకు రోడ్డు నిర్మాణం కోసం పరిశీలన చేశారు. 15 ఏళ్ల కిందట సీతంపేట పరిసర ప్రాంతాల నుంచి కొన్ని కుటుంబాలు వచ్చి ఇక్కడ పోడు వ్యవసాయం చేస్తూ బతుకుతున్నాయని, వీరు పంచాయతీ కేంద్రానికి రావాలంటే సరైన దారి లేదు. మండల, జిల్లాస్థాయి అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. దీంతో ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.

సంక్షేమ హాస్టళ్లలో సదుపాయాల కొరత

- సీపీఎం బృందం పర్యటనలో బయటపడ్డ వాస్తవాలు


వసతిగృహాల చుట్టూ మురుగుకూపాలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సంక్షేమ హాస్టల్‌లో మౌలిక వసతులు లేక విద్యార్థులు దుర్భరమైన జీవితాలు అనుభవిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేకపోవడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఎం నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం నగరంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లను సీపీఎం ప్రతినిధి బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా విద్యార్థులు అనేక సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. జిల్లాలో ఎస్సీ హాస్టల్స్ 31, బీసీ హాస్టల్స్ 78, ఎస్టీ హాస్టల్స్ 60 ఉన్నాయని, వీటిల్లో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించని వారు జిల్లాలో విమానాశ్రయాలు నిర్మిస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తక్కువ మెనూ చార్జీలతో అరకొర భోజన సదుపాయాలు అందుతున్నాయన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు జిల్లా మంత్రులకు పట్టవా అని ప్రశ్నించారు. వర్షం పడితే ఎస్సీ హాస్టల్ మొత్తం నీటితో నిండిపోతుందని, ఎస్సీ హాస్టల్ విద్యార్థులు ఎస్టీ హాస్టల్‌కి వెళ్లి తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఎస్టీ హాస్టల్‌లో గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌లో ఒక్కో హాల్ ఉన్నాయని, అందులోనే 200 మంది విద్యార్థులందరూ సామూహికంగా నిద్రించడం, భోజనం చేయడం, చదువుకోవడం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం ప్రతినిధి బృందం నాయకులు ఎం.గోవర్ధనరావు, పి.సుధాకర్, కె.సూరయ్య, ఎల్.మహేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సేన.. జగడాలేనా


కాంప్లెక్స్ ఆవరణలో జనసేన కార్యకర్తల మధ్య వాగ్వాదం

- జిల్లాలో సిగపట్లు పడుతున్న జనసేన నేతలు
- పదవుల ఊసెత్తొద్దంటున్న అధిష్టానం
- నియోజకవర్గాల్లో పట్టు కోసం కుమ్ములాటలు
- మంత్రి మనోహర్, ఎమ్మెల్సీ నాగబాబుల వ్యాఖ్యలపై క్యాడర్ అసంతృప్తి

అరసవల్లి:

జనసేన పార్టీలో కుమ్ములాటలు తప్పడం లేదు. పార్టీ బలపడేందుకు ఓ వైపు మంత్రి నాదెండ్ల మనోహర్, మరోవైపు ఎమ్మెల్సీ, ఉత్తరాంధ్ర పార్టీ బాధ్యుడు కొణిదెల నాగబాబు వరుసగా జిల్లాలో పర్యటిస్తున్నా పార్టీ శ్రేణుల్లో మాత్రం సంతృప్తి కనిపించడం లేదు. పైగా వీరు ఉంటున్న వేదికల్లోనే వర్గ విభేదాలు, కుమ్ములాటలు కనిపిస్తున్నాయి. ఇటీవల మంత్రి మనోహర్ జిల్లా పర్యటనలో కార్యకర్తల సమావేశంలో కొందరు నియోజకవర్గ ఇన్‌చార్జిలను అగౌరవ పరిచారని స్థానిక కార్యకర్తలు గుర్రుగా ఉన్నారు. తాజాగా ఎమ్మెల్సీ నాగబాబు పర్యటనలో కూడా శ్రీకాకుళం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్వేశ్వరరావుకు తెలియకుండానే పాతపట్నం నేతలు అన్నీ తామై కార్యక్రమాలను జిల్లా కేంద్రంలో నిర్వహిస్తుండడం వివాదాన్ని సృష్టించింది. శ్రీకాకుళం నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యేగా పోటీ చేసిన కోరాడ సర్వేశ్వరరావుకు వ్యతిరేకంగా పాతపట్నం నియోజకవర్గం నుంచి గేదెల చైతన్య వర్గం పట్టు కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తుందనే వాదన ఎమ్మెల్సీ నాగబాబు పర్యటనలో తేటతెల్లమైంది. ఈ రెండు వర్గాలు దాదాపుగా బాహాబాహీ దిశగా తోపులాటలకు దిగారు. ఎమ్మెల్సీ నాగబాబు ఆర్టీసీ కాంప్లెక్స్ పరిశీలన అనే కార్యక్రమం వేదికగా వర్గాల పోరు బయటపడింది. సుడా చైర్‌పర్సన్‌గా ఉన్న జనసేన నేత కొరికాన రవికుమార్ అండదండలతోనే సొంత నియోజకవర్గానికి చెందిన పాతపట్నం నేత గేదెల చైతన్య దూసుకుపోతున్నారని స్థానికంగా చర్చనీయాంశమైంది. అలాగే మరోవైపు ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జి, సీనియర్ నేత పేడాడ రామ్మోహనరావును కూడా ప్రధాన వేదికలపై పిలవకుండా ఓ వర్గం కుట్ర పన్నుతుందనే వాదనను ఆ నియోజకవర్గ క్యాడర్ తెరపైకి తెస్తోంది. ఇక జిల్లాకు జనసేన అగ్రనేతలొస్తే స్వాగతం నుంచి సాగనింపు వరకు ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి విశ్వక్‌సేన్ అంతా తానై వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం అధిష్టానం దృష్టిలో ఉంది. ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన రాజు ఇటీవలే కుటుంబ వ్యవహారాల్లో పోలీసు కేసుల్లో ఇరుక్కున్న సంగతి విదితమే. మిగిలిన నియోజకవర్గాల్లో ఇన్‌చార్జిలైతే టీడీపీకి అనుబంధంగా వ్యాపారాల్లో భాగస్వామ్యులవుతూ ఉన్నారంటే ఉన్నారనేలా వ్యవహరిస్తున్నారు. ఇక పార్టీ జిల్లాకు అధ్యక్షుడిగా ఉన్న చంద్రమోహన్ పనితీరుపై జిల్లా వ్యాప్తంగా అసంతృప్తి ఉందన్న సంగతి విదితమే.

నోరెత్తవద్దంటూ అధిష్టానం ఆదేశాలు

కూటమి ప్రభుత్వంలో భాగంలో ఉన్నామనే ధీమాలో జనసేన నేతలు చాలా చోట్ల నామినేటెడ్ పోస్టులకు, మరికొందరు త్వరలో జరగనున్న 'స్థానిక' ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉత్సాహంగా ఉన్నారు. అయితే ఎవ్వరూ పదవులు అడగొద్దని, మనకు అంత అనుభవాలు లేవని, అర్హతలు లేవంటూ అగ్రనేతలు వ్యాఖ్యానించడం పార్టీ శ్రేణులను దిక్కుతోచని ఆలోచనలో పడేసింది. పార్టీ ఎమ్మెల్సీగా వరుసగా రెండు సార్లు జిల్లాలో పర్యటించిన నాగబాబు పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ అధినేత పవన్ కల్యాణ్ కోరిక మేరకు మరో 15 ఏళ్ల వరకు కూటమి ప్రభుత్వం ఉంటుందని, మనం కూడా ఇలాగే టీడీపీకి మద్దతివ్వాలని చెప్పడంపై కార్యకర్తలు మండిపడుతున్నారు. అలాగే కార్యకర్తలకు దిశానిర్దేశం చేయకపోగా కసుర్లు, విమర్శలు, ఆగ్రహాన్ని ప్రదర్శించడం కూడా కొందరికి మింగుడు పడలేదు. తాజాగా మంత్రి మనోహర్ కూడా జిల్లాలో కార్యకర్తలు, నేతలతో మాట్లాడుతూ అదే 15 ఏళ్ల జపం చేశారు. దీంతో జనసేన శ్రేణులు ఆలోచనలో పడ్డాయి.

శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ పరిశీలన


కాంప్లెక్స్‌లో నిలిచిన నీటిని చూస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో 20 ఏళ్లుగా వరద నీటి సమస్య ఉందని జనసేన నేత, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఆయన గురువారం పరిశీలించారు. అధికారులతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. ఇంటిగ్రేటెడ్ బస్టాండ్ అవసరం ఉందని తెలిపారు. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ పర్యటనకు వచ్చిన నాగబాబు వెంట జనసేన పార్టీకి సంబంధించిన శ్రీకాకుళం సమన్వయకర్త కోరాడ సర్వేశ్వరరావు, పాతపట్నం సమన్వయకర్త గేదెల చైతన్య వర్గాల మధ్య పోరు కనిపించింది. ఆర్టీసీ అధికారులతో నాగబాబు మాట్లాడుతుండగా చైతన్య లోపలకు వెళ్లారు. సర్వేశ్వరరావు కూడా వెళ్లేందుకు ప్రయత్నించగా గేదెల చైతన్య వర్గం అడ్డుకుంది. దీంతో కొంతసేపు ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద నాయకులు కార్లు ఉంచడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

'మౌలిక వసతులు కల్పించాకే తరలిస్తాం'


లాటరీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ కృష్ణమూర్తి

సంతబొమ్మాళి: పోర్టు నిర్వాసిత కాలనీలో మౌలిక వసతులు కల్పించిన తర్వాతే మూలపేట గ్రామం ఖాళీ చేయించి మిమ్మల్ని తరలిస్తామని టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి అన్నారు. గురువారం పోర్టు నిర్వాసితులకు నౌపడలో కేటాయించిన ఆర్అండ్ఆర్ కాలనీలో నిర్వహించిన లాటరీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 506 పీడీఎఫ్‌లకు గాను ప్రతి పీడీఎఫ్‌కు 5 సెంట్లు ఇంటి స్థలం ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఆ స్థలం ఎక్కడ, మీ స్థలం ఏదీ అని తెలుసుకోవడానికి మాత్రమే లాటరీ తీస్తున్నామని అన్నారు. లాటరీ ద్వారా తీసిన నంబర్ ప్రకారం మీకు ఐదు సెంట్లు స్థలం చూపించడానికి 15 రోజుల సమయం పడుతుందన్నారు. సుడా అనుమతి పొందిన తర్వాతే లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయిస్తున్నామని, ఇది మార్చే అధికారం తనకు గానీ తహసీల్దార్‌కు గానీ లేదన్నారు. 586 ప్లాట్లను ఆరు బ్లాక్‌లుగా విభజించి ఎర్త్ ఫిల్లింగ్ ఇతర పనులు చేపడుతున్నామని అన్నారు. ఐదుకోట్ల 50 లక్షల రూపాయిలతో మరో రెండు అడుగులు ఎత్తు చేయడానికి ఎర్త్ ఫిల్లింగ్ పనులు చేపడుతున్నామని తెలిపారు. మౌలిక వసతులన్నీ కల్పిస్తున్నామని పేర్కొన్నారు. గుడి నిర్మాణానికి కూడా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆయనతో పాటు తహసీల్దార్ హేమసుందరరావు, స్థానిక సర్పంచ్ జీరు బాబురావు, మాజీ సర్పంచ్ జీరు భీమారావు, కోట నారం నాయుడు, జీరు శివ, రోహిణీరావ్, జీరు రాంబాబు తదితరులు ఉన్నారు.

'విద్యా ప్రమాణాల పెంపునకు కృషి'


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా గురుకుల విద్యాసంస్థల సమన్వయకర్త వై.యశోదలక్ష్మి

కంచిలి: గురుకుల విద్యాలయాల్లో విద్యా ప్రమాణాలు మునుపటి కంటే పెంచడానికి ఉపాధ్యాయులు, అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా గురుకుల విద్యాసంస్థల సమన్వయకర్త వై.యశోదలక్ష్మి పేర్కొన్నారు. మండల కేంద్రం కంచిలిలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాన్ని ఆమె గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల భవనాలను, డార్మిటరీ భవనాన్ని పరిశీలించారు. పిల్లలతో మాట్లాడి, వారి అవసరాలను తెలుసుకొన్నారు. అనంతరం గురుకులంలో సేవలందిస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావుతోనూ మాట్లాడారు. గురుకుల సమస్యలను కలెక్టర్‌కు నివేదిస్తానని తెలిపారు. భోజనశాలలో పనిచేస్తున్న సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఆమెకు గురుకుల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు సహకరించారు.

ముగిసిన జిల్లాస్థాయి స్కూల్ క్రికెట్ పోటీలు


విజేతగా నిలిచిన ఏపీ మోడల్ స్కూల్ పురుషోత్తపురం జట్టుతో జెడ్‌సీఎస్ అధ్యక్షుడు పుల్లెలశాస్త్రి, అతిథులు, కోచ్‌లు

- విజేతగా నిలిచిన ఏపీ మోడల్ స్కూల్ పురుషోత్తపురం
- రన్నరప్‌తో సరిపెట్టుకున్న శ్రీకాకుళం శ్రీచైతన్య స్కూల్

శ్రీకాకుళం న్యూకాలనీ: పది రోజుల పాటు కన్నుల పండువలా సాగిన జిల్లాస్థాయి అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీలు ముగిశాయి. శ్రీకాకుళం జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో జెడ్‌సీఎస్ స్కూల్‌గేమ్స్ హరకేశవ మెమోరియల్ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ 2025 సీజన్-1 చాంపియన్ ట్రోఫీని ఏపీ మోడల్ స్కూల్ పురుషోత్తపురం కైవసం చేసుకుంది. రన్నరప్‌గా శ్రీకాకుళంలోని మహాలక్ష్మినగర్‌కాలనీలో ఉన్న శ్రీచైతన్య (బ్రాంచ్-1) నిలిచింది. శ్రీకాకుళం నగరంలోని కోడిరామ్మూర్తి స్టేడియం మైదానం వేదికగా జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీవైఎన్ శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజా షేక్, మెంటార్ ఇలియాస్ మహ్మద్ పర్యవేక్షణలో ఈ నెల 8వ తేదీన ఈ పోటీలు మొదలయ్యాయి. ఫైనల్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీచైతన్య స్కూల్ 66 పరుగులు మాత్రమే చేయగా, ప్రతిగా బ్యాటింగ్ మొదలుపెట్టిన ఏపీఎంఎస్ పురుషోత్తపురం మూడు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో రాణించిన శ్యామ్‌సుందర్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. అలాగే టోర్నీలో అత్యద్భుతమైన ఆటతీరుతో రాణించినవారిలో బెస్ట్ బౌలర్‌గా హరికృష్ణ, బెస్ట్ బ్యాటర్‌గా సాత్విక్, బెస్ట్ ఫీల్డర్‌గా లిలిత్, మ్యాన్ ఆఫ్ ది టోర్నీగా శ్రీరామ్ ప్రత్యేకంగా బహుమతులు అందుకున్నారు. విజేతలకు ట్రోఫీలు, బహుమతులను జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్షుడు పీవైఎన్ శాస్త్రి, విద్యుత్‌ట్రాన్స్‌కో అధికారి రామకృష్ణ, ప్రసన్నకుమార్ బహూకరించారు.

భూమి లాక్కుంటున్నారు..

- జనసేన నాయకుడిపై మహిళ ఫిర్యాదు


విలేకరులతో మాట్లాడుతున్న చింతు విజయ

ఆమదాలవలస: తన భూమిని లాక్కునేందుకు జనసేన పార్టీ ఎంపీటీసీ అంపిలి విక్రమ్ అనే వ్యక్తి నాలుగేళ్లుగా తనను వేధిస్తున్నారని ఆమదాలవలస పట్టణానికి చెందిన మహిళ చింతు విజయ ఆరోపించారు. ఆమె గురువారం ఆమదాలవలసలో విలేకరులతో మాట్లాడారు. తాను బూర్జ మండలం కొల్లివలస గ్రామంలో 20 సెంట్ల భూమిని కొనుగోలు చేశానని, అదే భూమిని చేజిక్కించుకోవాలని అంపిలి విక్రమ్, వాళ్ల బావ పొండ్రంకి తారక్‌లు నాలుగేళ్లుగా తనను, తన కుటుంబాన్ని వేధిస్తున్నారని ఆమె చెప్పారు. సరుబుజ్జిలి తహసీల్దార్ రమణారావు భూమి కొలతలకు వచ్చినప్పుడు కూడా వారిద్దరూ పెట్రోలు పోసి సైట్ ఖాళీ చేయాలని బెదిరించారని పేర్కొన్నారు. కారుతో వెంబడించడం, రాత్రిళ్లు ఇంటి వద్ద రాళ్లు వేయించడం వంటి పనులు చేశారని ఆరోపించారు. తాను కోర్టును ఆశ్రయించగా, కోర్టు తనకు అనుకూలంగా ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందని, ఆ ఆర్డర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి, పోలీస్ స్టేషన్‌కు సమర్పించానన్నారు. అయినా వేధింపులు ఆగడం లేదని చెప్పారు. తనకు రక్షణ కల్పించాలని కోరారు.

అధికారుల తనిఖీలు.. బెంబేలెత్తిన వ్యాపారులు


మండల కేంద్రంలో కిరాణా దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఫుడ్ కంట్రోలర్ ఈశ్వరి

సారవకోట: మండల కేంద్రంలో గురువారం విశాఖపట్నం నుంచి ఫుడ్ కంట్రోలర్ ఎస్.ఈశ్వరి, జిల్లాకు చెందిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి కిరాణా దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. దీంతో వ్యాపారులంతా బెంబేలెత్తారు. రోడ్డు పక్కనే ఉన్న దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నారని తెలిసి అందరూ దుకాణాలు మూసివేశారు. తాము పరిశీలించిన దుకాణాల్లో తేదీల లేపాలు లేవని వారు తెలిపారు. వ్యాపారాలు చేసుకునే వారు స్వలాభం తగ్గించుకుని ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ఎక్కువ కాలం నిల్వ ఉన్న వస్తువులు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

పేకాట ఆడిన నలుగురికి జైలు శిక్ష

శ్రీకాకుళం క్రైమ్ : ఇటీవల జిల్లా కేంద్రంలోని మొండేటివీధిలో పేకాట ఆడుతూ పట్టుబడిన ఆరుగురిలో నలుగురికి ఒక నెల జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం బుధవారం తీర్పు వెలువరించింది. మరో ఇద్దరికి రూ. 3 వేలు జరిమానా విధించారు. దీనికి సంబంధించి ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ వివరాలు వెల్లడించారు. జిల్లా సెకెండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కె.శివరామకృష్ణ తీర్పు వెలువరించారని ఎస్ఐ పేర్కొన్నారు. డ్రంక్ అండ్‌డ్రైవ్‌లో కూడా ఒకరికి నెల రోజుల జైలు శిక్ష విధించింది.

స్టడీ అవర్లు తప్పనిసరి: డీఈఓ

పొందూరు: పాఠశాలల్లో ప్రతి ఉపాధ్యాయుడికి వారంలో 30 పీరియడ్లు ఉండేలా చూడాల్సిన బాధ్యత పాఠశాల హెచ్‌ఎందేనని జిల్లా విద్యా శాఖాధికారి రవికుమార్ స్పష్టం చేశారు. మండలంలోని కింతలి జెడ్పీ ఉన్నత పాఠశాల, తాడివలస ఉన్నత పాఠశాలలను గురువారం పరిశీలించారు. పరీక్షలలో విద్యార్థుల ఫలితాలను ఆధారంగా చేసుకుని విద్యార్థులకు గ్రేడ్‌లు నిర్ణయించి ప్రత్యేక తరగతులను నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ తప్పనిసరిగా నిర్వహించాలని, స్టడీ అవర్స్‌కు హాజరుకాని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎం కంఠయ్యను ఆదేశించారు.

గ్రామస్తుల నుంచి తల్లిదండ్రుల నుంచి, విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పాఠశాలలో సమస్యలు, ఉపాధ్యాయుల పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

క్రైమ్ కార్నర్

రైలు ఢీకొని వ్యక్తి మృతి


రైలు ఢీకొనడంతో పొదల్లో పడి మృతి చెందిన చలపతిరావు

టెక్కలి రూరల్: టెక్కలి రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం రైలు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని నర్సింగిపల్లి గ్రామానికి చెందిన సింహాద్రి చలపతిరావు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని రైల్వే గేటు నుంచి టెక్కలి రైల్వే స్టేషన్ మధ్యలో పట్టాల మీదుగా నడుచుకుంటూ వెళ్తుండగా రైలు వచ్చి ఢీ కొట్టడంతో పక్కనున్న పొదల్లోకి తుళ్లిపోయాడు. ప్రమాదం గమనించిన స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడిన చలపతిరావును తీసుకువెళ్లేందుకు 108 వాహనం రాగా అప్పటికే ఆయన మృతి చెందాడు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి


మృతదేహం

పలాస: పలాస రైల్వే స్టేషన్ పరిధిలోని రెండో ప్లాట్‌ఫారం లైన్‌లో వంతెన సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద జారి పడి మృతి చెందినట్టు పలాస జీఆర్పీ ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మృతుడికి సుమారు 45 ఏళ్ల వయసు ఉంటుందన్నారు. శరీరంపై నాచురంగు గల ఫాంటు, నీలం రంగు గల టీ షర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440627567 సంప్రదించాలని ఆయన కోరారు.

కొల్లవానిపేటలో..

నరసన్నపేట: మండలం కొల్లవానిపేట సమీపంలో రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించామని ఆమదాలవలస రైల్వే ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. విశాఖ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ ఢీకొని బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఒడిశా వాసిగా అనుమానిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు పోస్టుమార్టం కోసం తరలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతిచెందిన శ్రీను మృతదేహం

కవిటి: మండలంలోని ఎన్‌హెచ్-16 హైవే పై శిలగాం ఫ్లైఓవర్ దాటిన తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలి ఆది ఆంధ్ర వీధికి చెందిన వాడపల్లి శ్రీను(39) మృతి చెందాడు. టెక్కలి పట్టణం ఆది ఆంధ్ర వీధికి చెందిన వాడపల్లి శ్రీను ఉదయం టెక్కలి నుంచి తన ద్విచక్రవాహనంపై ఇచ్ఛాపురం మండలం సంతపేట గ్రామంలో ఉన్న బావమరిది పెంద్ర ముకేష్ ఇంటికి ప్రయాణిస్తున్నాడు. ప్రయాణం మధ్యలో కవిటి మండలం జమేదార్ పుట్టుగ గ్రామం దగ్గరలో ఎన్‌హెచ్ 16 రహదారి పై బండి అదుపు తప్పి హైవే డివైడర్‌ను గుద్దుకుని తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే 108 సిబ్బందికి సమాచారం అందించి ఇచ్ఛాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కవిటి ఎస్ఐ వి.రవివర్మ విలేకరులకు తెలియజేశారు.

వైద్య విద్యార్థులతో చికిత్సలా..?

- చదువులకు దూరమవుతున్నామని విద్యార్థుల ఆందోళన
- పీజీ స్టూడెంట్లు, హౌస్ సర్జన్లతో పీహెచ్‌సీల్లో వైద్యంపై సర్వత్రా విస్మయం

శ్రీకాకుళం: రాష్ట్ర ప్రభుత్వం పీహెచ్‌సీల్లో పని చేస్తున్న వైద్యుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా వైద్య కళాశాలలోని హౌస్ సర్జన్, పీజీ విద్యార్థులను పీహెచ్‌సీలకు తరలించడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. రిమ్స్‌లో పీజీ, హౌస్ సర్జన్ చేస్తున్న సుమారు 60 మందిని పీహెచ్‌సీలకు తరలించి అక్కడి రోగులకు వైద్య సేవలు అందజేయించడంపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. వీరంతా ఇంకా విద్యార్థులేనని గుర్తు చేస్తున్నారు. వీరిని పీహెచ్‌సీలకు తరలించడం వల్ల చదువుకు దూరమవుతున్నారని చెబుతున్నారు. జరగరానిది ఏదైనా జరిగితే రోగి బంధువులు పెట్టే కేసుల్లో ఇరుక్కునే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులను పీహెచ్‌సీలకు తరలించడం వల్ల రిమ్స్‌లో కూడా వైద్య సేవలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రిమ్స్‌లో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో 24 గంటలు పని చేసేది పీజీలు, హౌస్ సర్జన్లే. రిమ్స్‌లో వైద్యుల కొరత ఉన్నప్పటికీ, హౌస్ సర్జన్లు, పీజీలు ఉండడం వల్ల ఏదోలా నెట్టుకొస్తున్నారు. రిమ్స్‌లో 150 మంది వరకు పీజీలు, 150 మంది వరకు హౌస్ సర్జన్లు ఉండగా, వీరిలో 60 మంది వరకు పీహెచ్‌సీలకు వెళ్లిపోతుండడంతో రిమ్స్ రోగులకు కూడా సరైన వైద్య సేవలు అందించలేకపోతున్నారు.

అలాగే నేషనల్ మెడికల్ కౌన్సిల్ రిమ్స్‌లోని ప్రతి విభాగానికి లక్ష్యాలను నిర్దేశించింది. వీటిని చేరుకోగలిగితేనే ప్రస్తుతం ఉన్న సీట్లు కొనసాగేందుకు అవకాశం ఉంటుంది. అలా లేకుంటే పీజీ సీట్లు రద్దయ్యే ప్రమాదం ఉన్నప్పటికీ రాష్ట్ర అధికారులు దీన్ని పరిగణనలోనికి తీసుకోవడం లేదు. అలాగే లక్ష్యాలను అధిగమిస్తే మరిన్ని ఎంబీబీఎస్, పీజీ సీట్లు మంజూరయ్యేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పీజీలు, హౌస్ సర్జన్లు పీహెచ్‌సీలకు వెళ్లిపోతుండడంతో ఈ లక్ష్యాలను సైతం సాధించలేని పరిస్థితి ఏర్పడింది. వచ్చే ఏడాదికి మరిన్ని పీజీ సీట్లు సాధిస్తాం అన్న ధీమాలో అన్ని విభాగాల అధిపతులు ఉండగా, ప్రస్తుత పరిస్థితి వారిని డీలపడేలా చేస్తోంది.

ఊరూరా ఉద్యమం


మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఉద్యమం కొనసాగిస్తోంది. కోటి సంతకాల సేకరణలో ఊళ్లన్నింటినీ భాగస్వాములుగా చేస్తోంది. అందులో భాగంగా పార్టీ టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్ ఆధ్వర్యంలో గురువారం సంతబొమ్మాళి మండలం పాలతలగాం, ఎరకన్నపేట, కాకరాపల్లి గ్రామాల్లో రచ్చబండ సమావేశాలు నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ కార్యక్రమంలో పాల్గొని కోటి సంతకాల సేకరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. – సంతబొమ్మాళి